ఇంగ్లీష్ పరీక్షకు 30 మంది గైర్హాజరు

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో శనివారం జరిగిన పదో తరగతి ఇంగ్లీష్ పరీక్షకు 30 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలో మొత్తం 10,508 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 10478 మంది హాజరయ్యారు. శనివారం జరిగిన ఇంగ్లీష్ పరీక్షకు డిఇఒ ఆరు కేంద్రాలను పరిశీలించగా, డిఎల్ఒ నాలుగు కేంద్రాలను, ఇతర స్క్వాడ్లు 18 పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించాయని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్‌డివి రమణ తెలిపారు. జిల్లాలో ఎక్కడా మాల్ ప్రాక్టీసులు జరగలేదని పేర్కొన్నారు.

బోయ/వాల్మీకులను ఎస్‌టిలో చేర్చొద్దంటూ

గిరిజనుల నిరసన

బోయ, వాల్మీకులను ఎస్‌టిలో చేరుస్తూ శాసనసభలో తీర్మానం చేయడాన్ని వ్యతిరేకిస్తూ, ఆ తీర్మానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి గిరిజన సంఘం, ఆదివాసీ సంఘాల జెఎసి ఆధ్వర్యాన శనివారం పలుచోట్ల నిరసన ర్యాలీలు చేపట్టారు. ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో జియ్యమ్మవలస, కొమరాడ మండలాల్లో గిరిజన సంఘం నాయకులు కోరంగి సీతారాం, కొల్లి సాంబమూర్తి, గిరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షుడు అరిక చంద్రశేఖర్‌ను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. అనంతరం స్టేషన్‌కు తరలించి, సాయంత్రం విడిచిపెట్టారు.

- గిరిజన సంఘం నాయకుల నిర్బంధం
- చినమేరంగిలో పోలీసుల అడ్డగింతతో బైఠాయింపు
- సాలూరులో ర్యాలీ
- డిప్యూటీ సిఎం, ఎమ్మెల్యేకు వినతులు

ప్రజాశక్తి-జియమ్మవలస, సాలూరు,కొమరాడ

నిరసనల్లో భాగంగా కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి ఇంటి వద్ద నిరసన తెలిపేందుకు చినమేరంగి పాలిటెక్నిక్ కళాశాల నుంచి గిరిజనులు చేపట్టిన ర్యాలీని తాళ్ల డుమ్మ గ్రామం వద్ద పోలీసులు అడ్డుకున్నారు. గ్రామంలోకి రానీయకుండా నిలిపివేయడంతో అక్కడే గిరిజనులు, నాయకులు బైఠాయించారు. దీంతో పోలీసులకు గిరిజన సంఘ జెఎసి నాయకులకు మధ్య కొద్దిసేపు వాగ్వివాదం జరిగింది. గ్రామంలోకి ర్యాలీని అనుమతించబోమని కొద్దిమంది సభ్యులు మాత్రమే ఎమ్మెల్యే వద్దకు తీసుకువెళ్తామని పోలీసులు తెలిపారు. ప్రజాస్వామ్య యుతంగా నిరసన కార్యక్రమం చేపట్టి ఎమ్మెల్యేకు వినతినిచ్చేందుకు వెళ్తే పోలీసులు అడ్డుకోవడం అన్యాయమని గిరిజన సంఘం నాయకులు మండంగి రమణ, మండంగి శ్రీనివాసరావు, రుబ్బ లోవరాజు, పువ్వుల సత్యనారాయణ, తోయక జగదీశ్వరి, అప్పలస్వామి నిలదీశారు. దీంతో గిరిజనులు ఎమ్మెల్యే ఇక్కడికి రావాలని, లేదంటే ఆమె ఇంటి వరకు ర్యాలీని అనుమతించాలని పట్టుబట్టారు. దీంతో పోలీసులు చేసేదేమీ లేక ఎమ్మెల్యే ఇంటి సమీపం వరకు ర్యాలీని అనుమతించి అక్కడినుండి పదిమంది జెఎసి నాయకులను ఎమ్మెల్యే వద్దకు పోలీసులు తీసుకువెళ్లారు. గిరిజన జెఎసి నాయకులు ఎమ్మెల్యేను కలిసి శాసనసభలో చేసిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని వినతి అందజేశారు. పుష్ప శ్రీవాణి మాట్లాడుతూ దీనిపై ముఖ్యమంత్రితో చర్చించి గిరిజనులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని తెలిపారు.

నిరసనపై ఉక్కుపాదం

బోయ ,వాల్మీకులను ఎస్‌టిలో చేరుస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గిరిజన సంఘాలు చేపట్టిన నిరసన కార్యక్రమంపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు గిరిజన సంఘ నాయకులను ముందుగానే హౌస్ అరెస్టు చేసి అనంతరం స్టేషన్‌కు తరలించారు. ఎమ్మెల్యే నివాసం వద్ద పోలీసులు భారీగా మోహరించారు. పెద్ద ఎత్తున పోలీస్ బలగాలు చిన మే రంగి గ్రామంలో పహారా కాసారు. గిరిజన సంఘం నాయకులు కూరంగి సీతారాంను హౌస్ అరెస్ట్ చేశారు. అనంతరం ఆయనతో పాటు గిరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షుడు అరిక చంద్రశేఖర రావును అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. వీరిని సాయంత్రం విడిచిపెట్టారు. . అడిషనల్ ఎస్‌పి దిలీప్ కిరణ్ , ఎస్సీ ఎస్టీ కమిషన్ డిఎస్‌పి జి.మురళీధర్ కూడా వచ్చి నిరసన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

గిరిజన సంఘాల ర్యాలీ.. డిప్యూటీ సిఎంకు వినతి

బోయ, వాల్మీకి లను ఎస్టీల్లో చేరుస్తూ అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని కోరుతూ గిరిజనులు డిప్యూటీ సీఎం రాజన్నదొర కి వినతిపత్రం అందజేశారు. అంతకుముందు ఎపి గిరిజన సంఘం మండల అధ్యక్షుడు గెమ్మెల జానకీరావు, కార్యదర్శి వంతల సుందరరావు, ఆదివాసీ సంఘాల జెఎసి వైస్ చైర్మన్‌లు కొండగొర్రి ఉదయ్ కుమార్, మజ్జి నారాయణరావు ఆధ్వర్యాన గిరిజనులు ర్యాలీ గా డిప్యూటీ సీఎం రాజన్నదొర నివాసానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే నివాసాల ముట్టడి కార్యక్రమం నేపథ్యంలో డిఎస్‌పి ఎ.సుభాష్ ఆధ్వర్యాన పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు.ఏజెన్సీ ప్రాంతాల నుంచి గిరిజనుల రాకను ఎక్కడికక్కడ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో గిరిజన సంఘం నాయకులు డిప్యూటీ సీఎం రాజన్నదొర నివాసానికి శాంతియుతం గా ర్యాలీ నిర్వహించి వినతిపత్రం సమర్పించారు. బోయ, వాల్మీకిలను గిరిజన జాబితాలో చేరిస్తే తమ ప్రయోజనాలు పూర్తి స్థాయిలో దెబ్బ తింటాయని చెప్పారు.జీవో నెంబర్ 52ని రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతోస్పందించిన రాజన్నదొర గిరిజన సంఘాల జెఎసి నాయకులను సిఎం జగన్ మోహన్ రెడ్డి వద్దకు తీసుకు వెళ్తానని చెప్పారు. 2017లో టిడిపి దీనిపై తీర్మానాన్ని కేంద్రానికి పంపించిందని చెప్పారు. పాదయాత్రలో వున్న టిడిపి నేత నారా లోకేష్ బోయ, వాల్మీకి లను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని చెప్పారు. గిరిజనుల ఆందోళనకు సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు మద్దతు తెలిపారు.

కొమరాడ మండలంలో...

గిరిజన సంఘం తలపెట్టిన నిరసనలో పాల్గొనేందుకు వెళ్తారనే ఉద్దేశంతో కొమరాడలో ముందస్తుగా సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తిని శనివారం తెల్లవారు జాము 4గంటలకు పోలీసులు తన ఇంటి వద్ద నిర్బంధించి స్టేషన్‌కు తరలించారు. సాంబమూర్తి అరెస్టును గిరిజన సంఘం నాయకులు కత్రక సంగమ్మ ఖండించారు. మండల కేంద్రం జూనియర్ కాలేజ్ సెంటర్ వద్ద గిరిజన సంఘ నాయకులు లక్ష్మం, డంగ భద్రలో గిరిజన సంఘం నాయకులు మరక రామారావు, సరుగుడు గూడ గ్రామంలో ఆనందరావు, అంటి వలస గ్రామంలో రామస్వామి ఆధ్వర్యాన నిరసన తెలిపారు. వైసిపి ప్రభుత్వం చేస్తున్న అక్రమ అరెస్టులను, నిర్బంధాలను ప్రజలంతా ఖండించాలని కోరారు.

నాయకులను అడ్డుకున్న పోలీసులు

వీరఘట్టం: బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చొద్దని మండలంలోని వండవలో ఎమ్మెల్యే కళావతి క్యాంప్ కార్యాలయంలో ఎదుట నిరసన తెలిపేందుకు వచ్చిన గిరిజన సంఘ నాయకులు అప్పటికే వండవ గ్రామ జంక్షన్ వద్దకు అధిక సంఖ్యలో పోలీసులు చేరుకొని అడ్డుకున్నారు. గంటల తరబడి ప్రధాన రహదారిపై పోలీసులు, గిరిజనుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకున్నప్పటికీ పోలీసులు పట్టించుకోకపోవడంతో గిరిజన సంఘ నాయకులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కనీసం ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేస్తామని పోలీసులు అనుమతి ఇవ్వలేదు. దీంతో గిరిజన సంఘం నాయకులు వెనుతిరిగారు. అక్కడ ఎటువంటి అవాంఛనీయ ఘటన జరగకుండా ఉండేందుకు పాలకొండ డిఎస్పి జివి కృష్ణారావు పర్యవేక్షణలో సిఐ కె.మురళీధర్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

జియ్యమ్మవలస : ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి క్యాంప్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న గిరిజన సంఘ నాయకులు



రాజన్నదొరకు వినతిని అందజేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

పోలీసుల అదుపులో ఉన్న గిరిజన సంఘం నాయకులు సీతారాం, సిఐటియు నాయకులు సాంబమూర్తి

ఎస్‌పిగా విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా విజయనగరం ఐదో బెటాలియన్ కమాండెంటు విక్రాంత్ పాటిల్‌ను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఇక్కడ ఎస్‌పిగా పని చేస్తున్న వాసన్ విద్యా సాగర్ నాయుడుకు విశాఖ నగర డిప్యూటీకమిషనర్‌గా బదిలీ అయ్యింది.. విక్రాంత్ పాటిల్ భార్య దీపిక పాటిల్ విజయనగరం జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న సంగతి తెలిసిందే. కొత్తగా నియమించబడిన విక్రాంత్ పాటిల్ ఉమ్మడి జిల్లాలో 5వ బెటాలియన్ కమాండెంటుగానూ, గతంలో విజయనగరం ఒఎస్‌డిగా పనిచేయడం వల్ల విజయనగరం, పార్వతీపురం జిల్లాలపై పూర్తి అవగాహన ఉంది.

ఐప్యాక్ సర్వేతో అధికార పార్టీలో గుబులు

ప్రజాశక్తి-పాలకొండ

అధికార పార్టీకి అసంతృప్తి సెగ గట్టిగానే ఉంది. పాలకొండ నియోజకవర్గంలో ఇప్పటికే రెండుసార్లు వైసిపి జెండా ఎగిరింది. ఎస్‌టి నియోజకవర్గమైన పాలకొండలో వైసిపికి గట్టి పట్టే ఉంది. అయితే కొద్ది కాలంగా అందుకు భిన్నమైన పరిస్థితి కనిపిస్తుంది. ఓటర్లలో కొంత అసంతృప్తి ఉందని నియోజకవర్గంలో చర్చ జరుగుతుంది. దీంతో గత నెల రోజుల నుంచి ఐప్యాక్ సర్వే బృందం ఈ నియోజకవర్గంలో సర్వే చేపడుతున్నట్టు సమాచారం. క్షేత్రస్థాయి నుంచి ఈ సర్వే జరుగుతున్నట్టు తెలుస్తోంది. పాలకొండ నగర పంచాయతీలో అధికార పార్టీ నేతల మధ్య విభేదాలపై కూడా వీరు ఆరా తీసినట్టు సమాచారం. అదే విధంగా సచివాలయాల వారీగా పనితీరుపై కూడా దృష్టిపెడుతున్నట్టు తెలుస్తోంది. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులతో పాటు తెలుగుదేశం నేతలతో కూడా మాట్లాడుతున్నట్టు తెలుస్తోంది. పూర్తిగా ఇక్కడ పార్టీ పరిస్థితి ఎలా ఉంది. ముఖ్య నాయకుల పనితీరు ఎలా ఉందన్న అంశాలపై వారు సర్వే చేస్తున్నట్టు సమాచారం.

కొదమ గిరిజనులను వీడని రేషన్ కష్టాలు

- రెండు నెలలు గా అందని బియ్యం
- సివిల్ సప్లయ్ అధికారులపై డిప్యూటీ సిఎం ఆగ్రహం

ప్రజాశక్తి- సాలూరు

మండలంలోని గిరిశిఖర గ్రామం కొదమ పంచాయతీ గిరిజనులకు ఇంకా రేషన్ కష్టాలు వీడడం లేదు. పంచాయతీ పరిధిలో మూడు రేషన్ డిపోలు ఏర్పాటు చేసినా సమస్యలు తీరడం లేదు. ఏనెల సరుకుల ఆ నెల అందని పరిస్థితి ఏర్పడుతోంది. గతేడాది డిసెంబర్ నుంచి మార్చి వరకు జిసిసి వాహనం ద్వారా రేషన్ సరుకులు కొదమ, సిరివర, చింతామల డిపోలకు సరఫరా జరిగేవి. రేషన్ సరుకులను కొదమ గ్రామాలకు చేర్చే కాంట్రాక్టుని జిల్లా అధికారులు జిసిసికి అప్పగించడంతో సక్రమంగా సరఫరా జరిగింది. గత రెండు నెలలుగా రేషన్ బియ్యం అందకపోవడంతో గిరిశిఖర గ్రామాల గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై డిప్యూటీ సీఎం రాజన్నదొరకి గిరిజనులు ఫిర్యాదు చేశారు. ఆయన వెంటనే జిల్లా సివిల్ సప్లయ్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడే ప్రయత్నం చేశారు. వారు అందుబాటులోకి రాకపోవడంతో సిఎస్ డిటితో ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ జిల్లా అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొదమ గిరిజనులకు రేషన్ పంపిణీ తలనొప్పిగా మారిందని, అధికారుల తీరు వల్లనే సమస్యగా తయారయిందని ఆగ్రహించారు. సమస్య వెంటనే పరిష్కరించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గల్ఫ్ దేశాల్లో మహిళలకు ఉపాధి అవకాశాలు

కలెక్టరేట్ : హౌస్ కీపింగ్, కుకింగ్, కేర్ టేకర్ శిక్షణతో పాటు గల్ఫ్ దేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించే కార్యక్రమానికి 18 నుంచి 45ఏళ్లలోపు మహిళా అభ్యర్థుల నుంచి ఎపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ దరఖాస్తులు కోరుతోంది. రాష్ట్రంలో తూర్పు, పశ్చిమ గోదావరి, కడప జిల్లాల్లో హౌస్ కీపింగ్, కుకింగ్, కేర్ టేకర్ అంశాలపై శిక్షణ ప్రారంభించింది. ఈ శిక్షణలో విదేశాల్లో అనుసరించే మతపరమైన సంస్కృతులు, వారి పద్ధతులు, అలవాట్లు, విధానాలతో పాటు ఆయా దేశాల చట్టాల గురించి అవగాహన కల్పించడంతో పాటు శిక్షణ ఇస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి యు.సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనికిగాను మహిళలు ఐదో తరగతి చదివి ఉండాలని, చదవడం, రాయడం తెలిసి ఉండాలని, 18 నుంచి 45ఏళ్లలోపు వారై ఉండాలని, మహిళలకు మాత్రమే ఈ శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు.

అధిక నష్టం... అంచనాలు అంతంత మాత్రం

కుదించిన నిబంధనలు • రైతు కంట కన్నీళ్లు

ప్రజాశక్తి - మక్కువ

ఇటీవల కురిసిన అకాల వర్షాలు మండలంలోని రైతులకు అపార నష్టం కలగజేశాయి. మొక్కజొన్న, అరటి, జీడి మామిడి తదితర పంటలకు అధిక నష్టం వాటిల్లినా ప్రభుత్వం విధించిన నిబంధనలు రైతులకు మాత్రం కంటి తుడుపు అంచనాలు అంతంతమాత్రంగానే ఉన్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు అధికారులు అన్ని పంటలకు నష్టాలు దాదాపు 20 శాతం కూడా దాటలేదని రైతులు వాపోతున్నారు. 33శాతం కంటే అధికంగా నష్టం వాటిల్లే పంటలను మాత్రమే అధికారులు పరిగణలోకి తీసుకున్నారని పలువురు రైతులు వాపోతున్నారు. ఎంత శాతం అన్నది తమకు తెలియకపోవడం, అలాగే ప్రభుత్వం విధించే నిబంధనలు కూడా తమ పాలిట శాపంగా మారాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే అధికారులు మాత్రం పంటలు నష్టపోయిన ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకుండా అంచనాలు తయారు చేశామని చెబుతున్నారు.

మండలంలోని 18 ఎకరాల్లో మొక్కజొన్న సాగు అవుతుండగా అందులో దాదాపు 6 నుంచి 700 ఎకరాల్లో పంట కోతకు చేరుకుంది. మిగిలిన ఎకరాల్లో సాగవుతున్న మొక్కజొన్న వివిధ దశల్లో ఉంది. అయితే అకాల వర్షంతో సుమారు 95 ఎకరాల్లో మాత్రమే మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా తయారు చేశారు. ఇదిలా ఉండగా ఉద్యాన పంటల విషయానికొస్తే మండలంలో దాదాపు 5వేల ఎకరాల్లో ఈ పంటలు సాగుతున్నాయి. ఇందులో అధిక శాతం పామాయిల్ తోటలు సాగు కాగా, 1500 ఎకరాల్లో జీడి మామిడి సాగవుతుంది. అలాగే 1200 ఎకరాల్లో అరటి పంటను రైతులు సాగు చేస్తున్నారు. అకాల వర్షం నేపథ్యంలో 160 ఎకరాల్లో అరటి, ఐదెకరాల్లో జీడి మామిడి తోటకు నష్టం వాటిల్లినట్లు ఉద్యానవన శాఖ సిబ్బంది అంచనాలు తయారు చేశారు. పంట నష్టపోయిన రైతులకు ఈ అంచనాలు కంటితుడుపు చర్య అని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల సాకుతో రైతులకు అందాల్సిన నష్టపరిహారం అందకుండా పోయేలా అంచనాలు తయారవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అధికారులు వేసిన అంచనాలను చూస్తే వేలాది రూపాయలు నష్టం జరిగితే వందలాది రూపాయల నష్టం జరిగేలా చూపుతున్నాయని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మార్కొండపుట్టిలో నేలకొరిగిన మొక్కజొన్న పంట

ఆర్‌బికెల్లో జాబితాలు

అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతుల పంట నష్టపరిహారానికి సంబంధించ జాబితాలను ప్రతి సచివాలయ పరిధిలోని ఆర్‌బికె కేంద్రాల్లో వేలాడదీస్తామని అధికారులు తెలిపారు. సోమవారం నుంచి ఈ కార్యక్రమం చేపడతామన్నారు. జాబితాలో పేర్లు లేని వారెవరైనా ఉన్నట్లయితే తమకు తెలియజేయాలని మండల వ్యవసాయ అధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రైతులందరికీ న్యాయం జరిగేలా పంట నష్టాలు అంచనా వేశామని తెలిపారు.

నిబంధనలకు అనుగుణంగానే..

ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగానే ఉద్యానవన పంటల నష్టం అంచనాలు వేశామని ఉద్యానశాఖ అధికారి ప్రత్యూష భాను తెలిపారు. మండలంలోని మార్కొండపుట్టి, ఎస్.పెద్దవలస, శంబర, చెముడు, శాంతేశ్వరం, కవిరిపల్లి, సరాయివలస పంచాయతీల్లో అరటి పంటకు నష్టం వాటినట్లు ఆమె తెలిపారు. ఐదు ఎకరాల్లో మాత్రం జీడి మామిడి పంటకు నష్టం వాటిలిందన్నారు. 33శాతం ప్రభుత్వ నిబంధనలకు లోబడి సిబ్బంది అంచనాలు తయారు చేశారన్నారు.

పరిపాలనలో నవ్యత

ఉద్యోగులు, గిరిజనుల మన్ననలు పొందిన పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ పిఒగా 2021 అక్టోబర్ 8న డాక్టర్ బి.నవ్య బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పరిపాలనలో ఆమె కొత్తదానన్ని కలిగించారు. 2016 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన వీరు సీతంపేట ఏజెన్సీలో గిరిజనులకు అనేక సేవలు అందించారు. నిడాంబరమైన వ్యక్తి, ప్రజా సమస్యలు తెలుసుకోవడంలో ముందుంటారు. వివాదరహితరాలిగా మంచి గుర్తింపు ఉంది. వెలుగు ద్వారా నిర్వహిస్తున్న వన్ ధన్ వికాష్ కేంద్రాల బలోపేతంలో మంచి కృషి చేశారు. వందన వికాస్ కేంద్రాల ద్వారా గిరిజనులకు ఆర్థిక సౌలంబన వచ్చేలా ప్రణాళికలు రూపొందించారు. ఏజెన్సీలో పైనాపిల్ అధిక సాగవ్వడంతో ఇక్కడి నుండి సంతల్లో పైనాపిల్ కొనుగోలు చేసి వెలుగు ఎంఎంఎస్ ద్వారా ఇతర జిల్లాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించేలా ఐటిడిఎ ఉద్యోగులను భాగస్వాములు చేసి పైనాపిల్‌కు మార్కెటింగ్ చేయడంలో తన ముద్ర వేసుకున్నారు. అలాగే సచివాలయాలు సక్రమంగా నడిచేలా గిరిజనులకు, ప్రజలకు మెరుగైన సేవలందించేలా ఎప్పటికప్పుడు ఆమె పర్యవేక్షించారు. అలాగే రోగులకు మెరుగైన వైద్య సేవలు సకాలంలో అందించేలా ఆసుపత్రి పనితీరుపై వైద్యులను ఎప్పటికప్పుడు అప్రమతం చేయడం, సమావేశాలు ఏర్పాటు చేసి మెరుగైన వైద్య సేవలు అందించేలా ఆస్పత్రులు కూడా తనిఖీలు చేపట్టేవారు. అలాగే ఆశ్రమ పాఠశాలల్లోనూ, గురుకులాల్లో మెరుగైన విద్య, నాణ్యమైన భోజనం అందించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సవర భాషా వాలంటీర్లకు నాలుగు నెలలు జీతాలు చెల్లించడానికి ప్రత్యేక కృషి చేశారు. ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించారు. సచివాలయాలు, వెల్‌సెంటర్ల నిర్మాణాలు శరవేగంగా పూర్తి అయ్యేలా కృషి చేశారు. అలాగే నాడు-నేడు పనులు వేగవంతం చేశారు. ఈ సమయంలో ఆమె ఉపాధి కల్పన శిక్షణ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు.

ఐటిడిఎ పిఒ నవ్య

నూతన పిఒగా కల్పనా కుమారి

సీతంపేట కొత్త పిఒగా విచ్చేయనున్న కల్పనాకుమారి 2018 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందినవారు. అనకాపల్లి జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తూ సీతంపేట ఐటిడిఎ పిఒగా బదిలీపై వస్తున్నారు.

వ్యవ'సాయమూ' లేదు... పరిశ్రమలూ రావు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం ఉమ్మడి జిల్లా 80శాతం ప్రజానీకం ఆధారపడిన వ్యవసాయ రంగానికి తగిన తోడ్పాటు లేదు. మారిన పరిస్థితుల కారణంగా వ్యవసాయ విస్తీర్ణం తగ్గిపోతోంది. మరోవైపు ప్రభుత్వ విధానాల కారణంగా ఉన్న కొద్దిపాటి పరిశ్రమలు మూతపడుతునే ఉన్నాయి. ప్రభుత్వాలు మారుతున్నా అధినేతల పల్లకీలు మోయడం తప్ప రాజకీయంగా జోక్యం చేసుకునే నాధులే లేకపోవడంతో జిల్లా పరిస్థితులు నానాటికీ దిగజారుతున్నాయి. దీంతో, జిల్లాలో గ్రామీణ ముఖచిత్రాలు మారాయి. జిల్లా భౌగోళికంగా 16, 34, 750 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇందులో వ్యవసాయానికి అనువుగావున్న భూమి 9,25,387.5 ఎకరాల వరకు ఉంది. వ్యవసాయ, ఉద్యాన, వాణిజ్య పంటలు సాగుచేసేందుకు ఎంతో అనువుగా ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా వరి, చెరకు, మొక్కజొన్న, పత్తి, మినుములు, పెసలు తదితర అపరాలు వంటి వ్యవసాయ పంటలు ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో కేవలం 3,41,130 ఎకరాల్లో మాత్రమే సాగయ్యాయి. ఇందులో అత్యల్పంగా ఉద్యాన పంటల సాగు కేవలం 1,67,902 ఎకరాల్లో మాత్రమే ఉంది. నాన్ ఫుడ్ క్రాప్ ఏరియా కూడా 23,096 (6శాతం) ఎకరాలుగా నమోదైంది. గతంలో పోలిస్తే క్రమంగా సాగు విస్తీర్ణం తగ్గుతోంది. సాగు విస్తీర్ణం కన్నా బీడువారుతున్న సాగుభూములు 2శాతం అధికంగా ఉండడం గమనార్హం. సుమారు 80శాతం జనాభా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారు. కానీ, సాగునీటి వసతి కల్పించకపోవడం, ఉద్యాన పంటలను తగినంతగా ప్రోత్సహించకపోవడం, ప్రభుత్వం తరపున బోర్లు, బావులు మంజూరు చేయకపోవడం, మైక్రో ఇరిగేషన్ పథకాలు పూర్తిగా స్తంభించడం వంటి కారణావల్ల సాగు భూమి తగ్గుతోంది. లక్షా 30వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు తలపెట్టిన తోటపల్లి ప్రాజెక్టు మిగులు పనులు పూర్తికాకపోవడం వల్ల లక్ష్యంగా నీరుగారుతోంది. ఇప్పటికీ సుమారు 76వేల ఎకరాలకు మించి సాగునీరు అందడం లేదు. తారకరామ తీర్థసాగర్ చేపట్టిన దాదాపు 16ఏళ్లు దాటుతున్నా అతీగతీ లేదు. జంఝావతి తలపెట్టిన నాలుగు పదులు ఎప్పుడో దాటిపోయాయి. ఇక మైక్రో ఇరిగేషన్‌కు అనేది దాదాపు లక్ష్యం అనేదే లేకుండా పోయింది. దీనికితోడు వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులకు స్థానికంగా మార్కెట్ సదుపాయం కల్పించకపోవడం కూడా సాగుభూమి తగ్గుదలకు మరో కారణంగా చెప్పుకోవచ్చు. దీంతో, వ్యవసాయ రంగం ద్వారా జిల్లాకు కేవలం రూ.13,343 కోట్ల (41.2శాతం) ఆదాయం మాత్రమే వస్తోంది. ఈ ప్రభావం రైతులతోపాటు వ్యవసాయ రంగంపై ఆధారపడిన కార్మికులు, వృత్తిదారులపైనా పడింది. మత్స్యకారులు, వడ్రంగి, చేనేత వంటి వృత్తుల నుంచి నేటి తరం దూరమౌతోంది. సుమారు 30ఏళ్లలో వచ్చిన మార్పులే ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

జిల్లాలో జ్యూట్ మిల్లులు దాదాపు మూతపడ్డాయి. ఒకప్పుడు 20మిల్లులు ఉన్న ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం నాలుగైదుకు మంచి తిరగడం లేదు. ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీలకు చెంతనే ముడిసరుకు ఉన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల సహకారం కొరవడడంతో ఇప్పటికే ఉన్న పరిశ్రమలు ఉనికి కోల్పోవాల్సి వస్తోంది. పూసపాటిరేగ ప్రాంతంలో అరకొర పరిశ్రమలు మినహా ఇంకేమీ చెప్పుకోదగ్గ పరిశ్రమలేవీ లేవు. ఉన్న కొద్దిపాటి పరిశ్రమల మూత వల్ల వేలాది మంది ఉపాధి కోల్పోవడంతో ఆయా కుటుంబాలవారి ఆర్థిక స్థితిగతులు దెబ్బతిన్నాయి. జిల్లాకు వస్తున్న వార్షిక ఆదాయంలో పారిశ్రామిక రంగం ద్వారా వస్తున్న ఆదాయం ఏటా తగ్గిపోవడం ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. 2017-18లో 19.3శాతంకాగా, 2018-19లో 17.6శాతానికి తగ్గింది. 2019-20 నాటికి అది 15.9శాతానికి పడిపోయింది. ఆరికాభివృద్ధికి అవసరమైన వ్యవసాయ, పారిశ్రామిక రంగాలే ఇలా ఉంటే సేవారంగంలో పురోగతి ఆశించడం అత్యాసే అవుతుంది.

శంకరంబాడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

శంకరంబాడికి నివాళి

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని మూలిగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మా తెలుగు తల్లికి మల్లెపూదండ గీత రచయిత శంకరం బాడి సుందరాచారి 46వ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముందుగా సుందరాచారి చిత్రానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం హెచ్‌ఎం సామల సింహాచలం విద్యార్థులకు రచయిత జీవిత విశేషాలను వివరించారు. మా తెలుగు తల్లికి మల్లెపూదండ గేయాన్ని విద్యార్థులతో రాగయుక్తంగా ఆలపింపచేశారు. ఈ గేయంలో మన రాష్ట్రం యొక్క సంస్కృతి, గొప్పదనాన్ని గూర్చి ఎంతో చక్కగా అర్థవంతంగా కవి వివరించారని, అందుకే ఈ గేయాన్ని మన రాష్ట్ర గీతంగా ఎంపిక చేశారని అన్నారు. ప్రతిరోజు అన్ని విద్యా సంస్థలలో మా తెలుగు తల్లికి మల్లెపూదండ గేయం ప్రార్థన గీతంగా ఆలపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

డిప్యూటీ సింకు వికలాంగుడి వినతి

వినతి పత్రాన్ని పరిశీలిస్తున్న రాజన్నదొర

సాలూరు : పాలకొండ నియోజక వర్గంలో మూడు చక్రాల వాహనాల పంపిణీలో అక్రమాలు జరిగాయని వైసిపి వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ఎం.ప్రసాద్ శనివారం డిప్యూటీ సీఎం రాజన్నదొర కి వినతి పత్రం అందజేశారు. రాజన్నదొర నివాసంలో ఆయనను కలిసి తనకు జరిగిన అన్యాయం గురించి వివరించారు. అనర్హులకు, తక్కువ అంగవైకల్యం వున్నవారికి మూడు చక్రాల వాహనాలు పంపిణీ చేశారని, తనకు 80శాతం వైకల్యం వున్నప్పటికీ మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 70శాతం వైకల్యం ఉన్న వారికి మూడు చక్రాల వాహనాలు పంపిణీ చేశారని తెలిపారు. దీనిపై రాజన్నదొర మాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లాడి మూడు చక్రాల వాహనం మంజూరయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.

నెలాఖరులోగా ఆస్తి పన్ను చెల్లిస్తే 5 శాతం తగ్గింపు

పార్వతీపురం టౌన్ : ఈనెల 24 నాటికి గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి, ఖాళీ స్థలం పన్నులు ఏక మొత్తంగా చెల్లించినట్లయితే మొత్తం నగదుపై 5శాతం తగ్గింపుతో చెల్లించుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పార్వతీపురం పురపాలక సంఘం అభివృద్ధికి తోడ్పడాలని, ఈ పన్నులను మీ వార్డు సచివాలయంలోనైనా, మున్సిపల్ కార్యాలయం వద్ద కౌంటర్‌లో చెల్లించి తగు రసీదు పొందాలని కమిషనర్ తెలిపారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

సీతానగరం : మండలంలోని చినభోగిలి - మక్కువ అంతర్జిల్లా బిటి రహదారి విస్తరణ నిర్మాణం పనులను ఎమ్మెల్యే అలజంగి జోగారావు శనివారం పరిశీలించారు. పార్వతీపురం నియోజకవర్గం, సాలూరు నియోజకవర్గాలను అనుసంధానం చేస్తూ సాగే మక్కువ నుంచి చినభోగిలి వరకు గల అంతర్‌జిల్లా రహదారి విస్తరణ పనుల కోరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.32 కోట్ల మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ పనులను కాంట్రాక్టరు ఇటీవల ప్రారంభించడంతో పరిశీలించామన్నారు. రోడ్డు విస్తరణ పనులలో భాగంగా బగ్గందొరవలస గ్రామంలో సీసీ కాలువల నిర్మాణం సహితం పూర్తి చేశారన్నారు. అనుకున్న సమయంలోగా నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో మండల పార్టీ అధ్యక్షులు బొంగు చిట్టి రాజు, వైసిపి నాయకులు ఆర్వీ, టీ వెంకట అప్పల నాయుడు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

మోహన్‌ను అభినందిస్తున్న టిడిపి నాయకులు

లయన్స్ క్లబ్ చైర్మన్‌గా దొగ్గ మోహన్

పార్వతీపురం రూరల్ : స్థానిక లయన్స్ క్లబ్ చైర్మన్‌గా పట్టణానికి చెందిన దొగ్గ మోహ నరావు ఎన్నికైనట్లు మాజీ లయన్స్ క్లబ్ గవర్నర్ బొంపాడు చంద్రశేఖరరావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ తన కార్యాలయంలో ఆయన్ను అభినందించారు. మోహన్‌రావు గతంలో పార్వతీపురం ఏరియా ఆసుపత్రి చైర్మన్‌గా నిర్వహించగా, ప్రస్తుతం మండల పార్టీ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

హరి గోపాల్‌కు మాతృవియోగం

సీతానగరం : మండల కేంద్రమైన సీతానగరం ఎల్లమ వీధికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు సిహెచ్.హరిగోపాలరావు తల్లి శనివారం మృతి చెందడంతో పరుగులు ఆమెకు నివాళులర్పించారు స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు, మాజీ ఎమ్మెల్యేలు బి.చిరంజీవులు ఎస్.జయమణి, మాజీ ఎమ్మెల్సీ ద్వారపూడి జగదీష్, బొబ్బిలి మాజీ మున్సిపల్ చైర్మన్ బేబీనాయన, టిడిపి నాయకులు గర్భాపు ఉదయభాను, మండల పార్టీ అధ్యక్షులు కొల్లు తిరుపతిరావు, వేణుగోపాలనాయుడు, వైసిపి నాయకులు తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళ్లు అర్పించారు.

శివన్నపేటలో 'మా నమ్మకం నీవే జగన్'

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలో గల శివన్నపేటలో శనివారం మా నమ్మకం నీవే జగనన్న కార్యక్రమం మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ షేక్‌ఆదిల్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్‌పిటిసి సభ్యులు జి.సుజాత, జిల్లా కో ఆప్షన్ సభ్యులు షేక్ నిసార్ ముఖ్య అతిథులుగా హాజరై ఇంటింటికి వెళ్లి గత ప్రభుత్వానికి ఇప్పటి ప్రభుత్వానికి తేడాను వివరించి తమ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు మీకు నచ్చినట్లయితే మరోసారి వైసిపి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిటిసిసభ్యులు వి.బంగారనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు కె.గౌరీశంకర్రావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలో రెండో రోజున జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యాన జరిగింది. మండలంలోని బూర్జ, లక్ష్మీపురంలో ఈ కార్యక్రమం చేపట్టారు. సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, వైసిపి నాయకులతో కలిసి గ్రామాల్లో ప్రజల ఇళ్లకు వెళ్లి వారిని నేరుగా కలుసుకొని వారికి మన వైసిపి ప్రభుత్వం వచ్చాక చేకూరిన లబ్ధి, పొందిన


సీతానగరం: ఇంటింట ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ప్రయోజనాలతో పాటు గత ప్రభుత్వం మోసగించిన విధానాన్ని రెండు ప్రభుత్వాలకు మధ్య వ్యత్యాసం వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు బొంగు చిట్టిరాజు, గ్రామ సర్పంచ్ గుజ్జల దాసు, ఎంపిటిసి సభ్యులు టి.సూరపునాయుడు, టి.పార్వతమ్మ, సీనియర్ నాయకులు ఆర్వీ, టి.వెంకట అప్పల నాయుడు, బి.ముకుంద, మండల త్రినాథ, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, వైసిపి కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : మండలంలోని వైసిపి ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లోనూ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం రెండో రోజు శనివారం కొనసాగింది సూడిగంలో ఎంపిపి మజ్జి శోభారాణి, కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేసిన కార్యక్రమాలను వివరిస్తూ ముఖ్యమంత్రి జగన్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం ఇళ్లకు, సెల్ఫోన్లకు స్టిక్కర్ అంటించే కార్యక్రమం నిర్వహించారు. చిన్నమరికిలో త్రినాధరావు పెదమరికిలో సోమశేఖర్, చిన్న బండపల్లిలో సర్పంచి గండి శంకరరావు, ఎంపిటిసి బంకురు రవికుమార్, బందలిప్పిలో యాళ్ల ప్రతాప్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు కొనసాగాయి.

తీర్మానంపై సంతకం చేయలేదని నిరూపించుకోండి

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

బోయ వాల్మీకి కులాలను ఎస్టీలో చేర్చుతూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన తీర్మానం ఆమోదిస్తూ ట్రైబల్ అడ్వైజరీ కమిటీలో సంతకాలు చేయలేదని కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి తనకు తానుగా నిరూపించుకోవాలని ఆదివాసీ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. కొన్ని కులాలను అదనంగా ఎస్టీ జాబితాలో చేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన తీర్మానం వెనుక్కు తీసుకోవాలంటూ గిరిజన సంఘాల జెఎసి కార్యాచరణలో భాగంగా శనివారం ఎమ్మెల్యే వద్దకు గిరిజన సంఘాలు, ఆదివాసీ సంఘాల ఐక్య కారణ సమితి ఆధ్వర్యంలో ఆదివాసీలు ర్యాలీగా చినమేరంగి వెళ్లారన్నారు. బోయ వాల్మీకిలను- షెడ్యూల్ తెగల జాబితాలో చేర్చుతూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపిన రిపోర్టును వెనక్కు తీసుకోవాలని, తక్షణమే ఎమ్మెల్యేగా రాజీనామా చేసి, ఆదివాసీల పక్షాన పోరాడాలని డిమాండ్ చేశారని తెలిపారు. అయితే ఎమ్మెల్యే స్పందించి శాసనసభ సాక్షిగా బోయ వాల్మీకిలను ఎస్టీల జాబితాలో చేర్చుతూ చేసిన తీర్మానం నిజమేనని - మెజారిటీ ఎమ్మెల్యేల మేరకు అలా చేయడం జరిగిందని, ట్రైబల్ అడ్వైజరీ కమిటీ తీర్మానం చేయలేదని, అందులో తాను సంతకాలు చేయలేదని- ఒకవేళ దీనికి ఆధారాలు చూపిస్తే తక్షణమే రాజీనామాకు సిద్ధమని సవాల్ విసరడం సబాబు కాదని అన్నారు. ఆదివాసీలు నమ్మి ఓటేస్తే ఆదివాసి టిఎసి తీర్మానంలో సంతకం చేయలేదని రుజువు చేసుకోవాల్సిన బాధ్యత ఎమ్మెల్యేకు లేదా? అని డిమాండ్ చేశారు. ఇలాంటి వైఖరి కొనసాగితే భవిష్యత్తులో తగిన బుద్ధి చెబుతామని అన్నారు.

ఆదివాసీ నాయకుల ముందస్తు అరెస్టులు ఖండన

ఆదివాసీ ప్రజలు, విద్యార్థులు, నిరుద్యోగుల తరుపున నిలబడిన నాయకులను ముందస్తు అరెస్ట్ చేయడం రాష్ట్ర ప్రభుత్వం పిరికిపంద చర్య గానే భావిస్తున్నాం. తమ సమస్యలను చెప్పుకోవడానికి ఎమ్మెల్యేలకు వినతి పత్రం ఇచ్చే సందర్భంలో ముందస్తు అరెస్టులు ఖండిస్తున్నాం. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ఇంకా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి ముందస్తు అరెస్ట భవిష్యత్తులో ఎమ్మెల్యేలకు గుణపాఠం తప్పదన్నారు. అంతకు ముందుగా పోలీసు శాఖ వారు ఆదివాసీ సంఘాల నాయకులను పిలిచి కౌన్సిలింగ్ పేరుతో నిరసన కార్యక్రమాలు చేస్తే మీపై రౌడీషీట్ కేసులు నమోదు చేస్తామని చెప్పి బెదిరిస్తున్నారన్నారు. ఇందుకు ఉదాహరణ శుక్రవారం పార్వతీపురం డిఎస్‌పి కొంతమంది ఆదివాసీ నాయకులను పిలిపించి బెదిరిస్తున్న విషయం గుర్తు చేస్తున్నామన్నారు. కావున ఇటువంటి దౌర్జన్యాలకు పాల్పడుతున్న అధికారులపై చట్టపరమైన చర్యలకు గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో గిరిజన జెఎసి వైస్ చైర్మన్లు మండంగి రమణ, కద్రక రామస్వామి, ఉర్లక్క మల్లయ్య, రొబ్బా లోవరాజు, ఆదివాసీ సంఘాల నాయకులు, నిరుద్యోగులు, ప్రజలు, యువత పాల్గొన్నారు.

అధికారులకు పలు సూచనలు చేస్తున్న సబ్ కలెక్టర్ కమల్

హద్దు రాళ్లు ఏర్పాటు పరిశీలన

పాలకొండ రూరల్ : మండలంలోని గుడివాడ, చింతాడ గ్రామాల్లో రీ సర్వే పూర్తయిన భూముల్లో వేస్తున్న సర్వే రాళ్లను సబ్ కలెక్టరు నూరుల్ కమర్ ఆదివారం పరిశీలించారు. హద్దుల ప్రకారం సర్వేరాళ్లను వేయాలని సిబ్బందికి సూచించారు. పాలకొండ డివిజన్లో సకాలంలో సర్వే రాళ్లను వేసేందుకు అన్ని చర్యలు చేపట్టామన్నారు.

స్టోన్ ప్లాంటేషన్ పరిశీలన

సీతంపేట : మండలంలోని గడిగుడ్డి, కిరప, కొండపేట గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్‌ను పాలకొండ సబ్ కలెక్టర్ నూరల్ కమర్ శనివారం పరిశీలించారు. సమగ్ర భూ సర్వేలో భాగంగా ఈ స్టోన్ ప్లాంటేషన్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని రెవెన్యూ సిబ్బందికి ఆదేశించారు. ఈయనతో పాటు తహశీల్దార్ నరసింహుమూర్తి సర్వేయరు శివ తదితరులు ఉన్నారు.

టెన్త్ పరీక్షా కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి- గుమ్మలక్ష్మీపురం

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహణ సక్రమంగా ఉండేటట్లు ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్మెంటల్ అధికారులు చూడాల్సిన బాధ్యత ఉందని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ బి. సూర్యనారాయణ తెలిపారు. శనివారం ఆయన మండలంలోని భద్రగిరి ఏపీ గిరిజన గురుకుల బాలికల పాఠశాల (పీటిజీ), గురుకుల బాలుర పాఠశాల, టెక్కబాయి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలల పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పరీక్షల నిర్వహణ పట్ల ఆజాగ్రత్తగా ఉండకూడదన్నారు. వేరే పాఠశాలల నుంచి వచ్చిన బాలికలను పరీక్ష కేంద్రాల్లో ఉంచి వారికి సబ్జెక్ట పరంగా అనుమానాలు వస్తే తక్షణమే నివృత్తి చేయాలని సబ్జెక్ట టీచర్లకు సూచించారు. పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తితే తక్షణమే అందుబాటులో ఉన్న ఆరోగ్య కేంద్రాలకు, ఆసుపత్రులకు తరలించి చికిత్సను అందించాలని సూచించారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్

అనంతరం ఆయన భద్రగిరి ఏపీ గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో బాలికల డార్మెటరీ భవనాలు పెచ్చులు ఊడిపోవడాన్ని పరిశీలించారు. తక్షణమే బాలికలను ఈ డార్మెటిరీ నుంచి వేరే భవనాల్లోకి తరలించాలని ఆదేశించారు. అనంతరం పిల్లల కోసం వండిపెట్టిన ఆభార పదార్థాలను రుచి చూశారు. ఆయన వెంట ప్రిన్సిపల్ కమల కుమారి, బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ వరప్రసాద్‌బాబు, తదితరులు ఉన్నారు.

ముస్లింలకు శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే జోగారావు

ముస్లిములకు రంజాన్ శుభాకాంక్షలు

పార్వతీపురం రూరల్ : పవిత్రమైన రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని పార్వతీపురం ముస్లిం మత పెద్దల, కమిటీ సభ్యులు ఎమ్మెల్యే అలజంగి జోగారావుని శనివారం తన క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసారు. ఏటా తన చేతుల మీదుగా అందించే రంజాన్ తోఫా ఈ సంవత్సరం కూడా అందిస్తానని ఎమ్మెల్యే వారికి ఈ సందర్భంగా చెప్పారు. షాదీ ఖానా కూడా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు అందరికి రంజాన్ శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, వైసిపి సీనియర్ నాయకులు సఫీ, జలాల్, ఇతర పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

వీరఘట్టం : మండలంలోని కత్తులకవిటి జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న భూమికి, భార్గవి, రోషినిలకు ప్రతిభ అవార్డులు లభించినట్లు ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తులో పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి అవసరమైన నైపుణ్యాన్ని పెంపొందించే కార్యక్రమంలో భాగంగా ఎపి ఇఎండిపి రాష్ట్రస్థాయిలో పిఎఫ్‌ఎఫ్‌పిఎన్‌ఈపి అనే అంశంపై విజయవాడలో ప్రాజెక్టును ప్రదర్శించారన్నారు. ఇందులో విద్యార్థులు ప్రతిభా చూపడంతో అమెజాన్ సంస్థ విద్యార్థులకు రూ.2వేలు చొప్పున నగదుతో పాటు సర్టిఫికెట్ అందజేసినట్లు తెలిపారు.

విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందిస్తున్న హెచ్‌ఎం

అంగన్‌వాడీ పిల్లలకు ఆరోగ్య తనిఖీలు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని నిడగల్లు, నీలకంఠాపురం, వెంకటాపురం (కె), పాపమ్మవలస, మరిపివలస గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలను శనివారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు ఆకస్మికంగా సందర్శించారు. ప్రాథమికంగా ఉండాల్సిన మందులు ఐరన్ ఫోలిక్ యాసిడ్ సిరప్‌లు, ఐరన్ మాత్రల స్టాక్ వివరాలను ఆయన పరిశీలించారు. పిల్లలు, గర్భిణీల్లో రక్తహీనత నివారణకు ఎంతో ఆవశ్యకమైన ఈ మందులు అంగన్వాడీ కేంద్రాల్లో తప్పకుండా ఉంచాలని, వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు స్టాక్‌ను పరిశీలించి అవసరమైన మేరకు భర్తీ చేయాలని సూచించారు. గర్భిణీలకు ఐరన్ మాత్రలు ప్రతి రోజూ భోజనం తర్వాత వేయించాలని, అలాగే పిల్లలకు వారానికి రెండు సార్లు ఐరన్ సిరప్‌లు భోజనం తర్వాత వేయించాలని సూచించారు. ఈ మేరకు ఐరన్ సిరప్‌ను సిబ్బంది పిల్లలకు వేయడాన్ని డిఐఒ పరిశీలించారు. పిల్లల బరువు, ఎత్తులను పరిశీలించి వయసుకు తగ్గట్టుగా ఉన్నదీ, లేనిదీ సరిచూశారు. ఇద్దరు పిల్లలను జిల్లా ఆసుపత్రిలో ఎన్‌ఆర్‌సి కేంద్రంలో చేర్పించాల్సిందిగా సూచించారు. అలాగే పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ రికార్డులను పరిశీలించి ప్రతినెలా ఈ వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయగౌడ్, వైద్య, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలను వైద్య బృందం పరిశీలన

పార్వతీపురం రూరల్ : అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు, బాలింతలకు అందించాల్సిన వైద్య సదుపాయాలు, మాత్రలు, మందులు లభ్యత పై శనివారం మండలంలోని పలు అంగన్వాడీ కేంద్రాలలో

సీతానగరం: విద్యార్థులను తనిఖీ చేస్తున్న డిఐఒ జగన్మోహన్‌రావు

బందలిప్పి వైద్యాధికారి డాక్టర్ ఎన్‌ఎంకే తిరుమల ప్రసాద్ ఆధ్వర్యంలో వైద్య బృందం పర్యటించి పరిశీలించారు. ముందుగా చిన్న బండపల్లి మూడవ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలింతలు చిన్నారులలో రక్తహీనతకు లోను కాకుండా ఉండేందుకు అంగన్వాడి కేంద్రాలలో ప్రభుత్వం అందుకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచుతుందన్నారు. వారికి అందించాల్సిన సరుకులు పలు కేంద్రాలలో సక్రమంగా జరగటం లేదన్న ఆరోపణలు రావడంతో స్పందించిన జిల్లా వైద్యాధికారి బి జగన్నాధ రావు జిల్లా వ్యాప్తంగా 20 బృందాలను ఏర్పాటు చేసి పరిశీలనకు ఆదేశించాన్నారు. కేంద్రాల వారీగా పరిశీలనలు జరిపి మందుల వినియోగంపై నివేదిక సమర్పించాలని కోరడంతో తాము పార్వతీపురం మండలంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఒ త్రినాధ రావు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితుడిని ఆదుకోవాలి

బాధితునితో మాట్లాడుతున్న నాయకులు

పార్వతీపురం టౌన్ : అగ్ని ప్రమాద బాధితున్ని ఆదుకోవాలని జనసేన పార్టీ నాయకులు కోరారు. శనివారం ఆ పార్టీకి చెందిన పార్వతీపురం మన్యం జిల్లా నాయకులు గొర్లి చంటి, వంగల దాలి నాయుడు, రాజాన రాంబాబు, వంగలపూడి నాని తదితరులు రాయగడ రోడ్డులో అగ్నిప్రమాద బాధితులు మండల శ్రీధర్ కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రమాదానికి సంబంధించిన కారణాలను అడిగి తెలుసుకున్నారు. గత సోమవారం రాత్రి తమ పాన్ షాప్ మొత్తం అగ్నికి ఆహుతైందని బాధితుడు వాపోయాడు. ఈ ప్రమాదంలో సుమారు రెండున్నర లక్షల రూపాయలు నష్టం జరిగిందని ఆవేదన చెందాడు. పాన్ షాప్ మీదే ఆధారపడి భార్య ముగ్గురు పిల్లల్ని పోషించుకుంటున్నానని, ఇప్పుడు అది కాలిపోయి బూడిద అయిందని చెప్పారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ అగ్ని ప్రమాద బాధతున్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కుటుంబం ఆధారపడే బడ్డీ కాలిపోవడంతో కుటుంబం రోడ్డున పడిందన్నారు.

ఘనంగా అల్లు అర్జున్ పుట్టిన రోజు వేడుకలు

పార్వతీపురం టౌన్ : సినీ హీరో అల్లు అర్జున్ పుట్టినరోజు వేడుకలు శనివారం పార్వతీపురం పట్టణంలోని ఆశాజ్యోతి అనాధాశ్రమంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమం యువ మెగా ఫ్యామిలీ సేవా సంఘం, అల్లు అర్జున్ ఆర్మీ ఆధ్వర్యంలో పిల్లలకు స్వీట్లు పంచి కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువమెగా ఫ్యామిలీ అభిమానుల ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరెన్నో సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో యువమెగా ఫ్యామిలీ సేవా సంఘం అధ్యక్షుడు రాజాన రాంబాబు, అల్లు అర్జున్ ఆర్మీ ప్రెసిడెంట్ బలంకి శంకర్, గొర్లి చంటి, గౌరీ, చైతు, రాజేష్, అల్లు అర్జున్ అభిమానులు పాల్గొన్నారు.

వేసవి తాపానికి ఉపశమనం

●జోరుగా పుచ్చకాయల విక్రయాలు ● ఆరోగ్యానికి మేలంటున్న వైద్యులు

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

రోజురోజుకు పెరుగుతున్న ఎండల నుంచి శరీరానికి ఉపసమనం ఇచ్చి ఆరోగ్యాన్ని అందించే పుచ్చకాయలు (వాటర్‌మిలాన్) మార్కెట్‌లోకి వచ్చాయి. చిన్నారుల నుంచి పెద్దవాళ్ల వరకు వీటిని ఇష్టంగా తింటున్నారు. వేసవి ఎండల్లో ఇవి ఆరోగ్యానికి ఎంతో మంచివి. పెరుగుతున్న ఎండలకుతోడు పుచ్చకాయల అమ్మకాలు జోరందుకున్నాయి. ఇటీవల వీటికి పెరిగిన డిమాండ్‌తో ఎక్కడికక్కడ తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. వీటిలో సుగర్ బేబి, మధుర ఫలాలు, ఆర్కిమెన్ వంటి రకాలకు మంచి గిరాకీ వస్తుంది. ప్రస్తుత మార్కెట్‌లో కిలో రూ.22 నుంచి 25 వరకు లభిస్తుంది. ముక్కల సైజును బట్టి రూ.10 వరకు లభిస్తుంది.

పోషక విలువలు అధికం

పుచ్చకాయల్లో మంచి విలువైన పోషక విలువలున్నాయి. వీటిని తినడం వల్ల శరీరానికి మేలు చేకూరుతుందని వైద్యులు సూచిస్తున్నారు. విటమిన్-బి, పొటాషియం, ఈ ఫలం ద్వారా పుష్కలంగా లభిస్తాయని చెబుతున్నారు. ఇందులో కొవ్వు పదార్థాలుండవని, శరీరానికి మంచి శక్తి లభిస్తుందని పేర్కొంటున్నారు. పుచ్చకాయలో

మండల కేంద్రంలో పుచ్చకాలను విక్రయిస్తున్న వ్యాపారి

92శాతం అల్కలైన్, నీటితో పాటు పీచు పదార్థాలు ఉండడం వల్ల మూత్ర పిండాలకు, మూత్రనాళాలకు ఎంతో ఉపయోగం. మలబ ద్ధకాన్ని నివారించడంలో ఇది ఎంత గానో ఉపయోగ పడుతుంది. ఇందులో ఉండే బీటాకెరోటిన్ శరీరంలో రోగనిరోధ కశక్తిని పెంచుతుంది. అలాగే వృద్ధాప్యంలో వచ్చే అంధ త్వాన్ని తగ్గించే గుణం ఉంది. ఆస్తమా, మధు మేహం, మోకాలి నొప్పులు వంటి సమస్యలకు బాగా పనిచేస్తుంది. రక్త ప్రసరణ సక్రమంగా జరిగేలా చేస్తుంది. వంద గ్రాముల పుచ్చకాయలో 91.45 గ్రాముల నీరు, 6శాతం చక్కెర, 90కేలరీల శక్తి, 7.6 గ్రాముల పిండి పదార్థాలు, 0.6శాతం మాంస కృతులు, పొటాషియం 12 గ్రాములు, కాల్షియం 7 గ్రాములు, సోడియం ఒక మిల్లీ గ్రాము వంతున ఉంటాయని వైద్యులు సూచిస్తున్నారు.

గ్రామాల్లో విరివిగా అమ్మకాలు

వేసవి ఎండలు మండిపోతుండడంతో మండల వ్యాప్తంగా పుచ్చకాయల దుకాణాలు వెలశాయి. పాలకొండ పట్టణంలో ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద, ఆర్‌డిఒ కార్యాలయం వద్ద, వీరఘట్టం రోడ్డులో విస్తృతంగా పుచ్చకాయల వ్యాపారాలు జరుగుతున్నాయి. ఆయా మార్గాల్లో ప్రయాణించే వారు, విద్యార్థులు ఎండ తీవ్రత నుంచి ఉపసమనం పొందేందుకు వీటిని తింటున్నారు. గ్రామాల్లో సైతం విరివిగా వీటిని విక్రయిస్తున్నారు.

నేరాలు ఘోరాలు

గాయపడిన వ్యక్తి మృతి

మహేశ్వరరావు(ఫైల్)

సీతానగరం : గత నెల 30న పనుకు పేట సెంటర్ వద్ద రెడ్డి వాని వలస గ్రామానికి చెందిన రెడ్డి మహేశ్వర రావు రోడ్డు ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. అతను చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. తన అత్తవారి గ్రామం పనుకుపేట నుండి సైకిల్ మీద తమ సొంత గ్రామమైన రెడ్డివాని వలసకు తిరిగి వెళుతుండగా, పార్వతీపురం నుండి వస్తున్న వ్యక్తి ద్విచక్రవాహనంతో సైకిల్ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గాయపడిన మహేశ్వరరావును పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి విజయనగరం, అక్కడి నుంచి విశాఖలోని ఒక ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. చెవులు, ముక్కు వెంట రక్తం కారడం వల్ల బ్రెయిన్‌కు ఆపరేషన్ చేశారు. అయినా ఫలితం లేక శుక్రవారం సాయంత్ర మరణించాడు. కేజిహెచ్‌లో పోస్టుమార్టం తరువాత మృతదేహాన్ని శనివారం స్వగ్రామానికి తీసుకొచ్చారు. ఈయన పార్వతీపురం మన్యం జిల్లా సిపిఎం పార్టీ కార్యదర్శి రెడ్డి వేణు, పూర్వ పార్టీ కార్యదర్శి దివంగత రెడ్డి శ్రీరామమూర్తి, విజయనగరం జిల్లా సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి రెడ్డి శంకర్రావులకు సోదరడు.

భర్తపై అలిగి భార్య ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

బలిజిపేట మండలం వెంగాపురం గ్రామానికి చెందిన యామల వరలక్ష్మి అనే వివాహిత శుక్రవారం రాత్రి తన భర్తతో పడిన ఘర్షణ కారణంగా మనస్థాపం చెంది శనివారం ఉదయం ఇంట్లో ఉన్న లైజాల్ ఫినాయిల్‌ను తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. భార్య పరిస్థితి గమనించిన భర్త వెంటనే బలిజిపేట పిహెచ్‌సికి తరలించి ప్రథమ చికిత్స అందించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యామల వరలక్ష్మి

కోర్టు నోటీసు
మహారాజశ్రీ సాలూరు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
I.A.149/2022 O.S.125/2018

Between :
ఆరిశెట్టి అశోక్ కుమార్ గుప్తా .....పిటిషనరు/వాది
And:
శ్రీగాకుళపు నర్సింగరావు (Died)
శ్రీగాకుళపు త్రివేణి వగైరాలు .....రెస్పాండెంట్లు
(Proposed Defendant)

To
Respondant No.4
శ్రీగాకుళపు శంకరరావు, S/o లేటు నర్సింగరావు, వ॥ 30 సం॥లు, వ్యాపారం, మోసూరు గ్రామం, పాచిపెంట మండలం, పార్వతీపురం మన్యం జిల్లా

పై నెంబరు IA 149/2022ను పిటిషనరు/వాది గారు మీ తండ్రిగారు మరణించినందున మిమ్మలను మీ యితర కుటుంబ సభ్యులను శ్రీగాకుళపు నర్సింగరావు గారి వారసులుగా పై దావాలో చేర్పించమని పై కోర్టులో దాఖలు చేసియున్నారు. పై పిటిషనులో 4వ రెస్పాండెంటు/ప్రతివాది అయిన మీరు శ్రీ కోర్టువారు నోటీసు పంపించిన మీరు తీసుకోనక కాలయాపన చేయుచున్నందున ఈ వార్తా పత్రిక ద్వారా మీకు తెలియజేయమని **తే 25-04-2023దీ** నాటికి వాయిదా వేసినారు. కావున **ఆ దినం ఉదయం గం॥ 10-30ని॥లకు** పై కోర్టువారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యడల మీ పరోక్షముగా తీర్మానించబడును.

శ్రీ లావుడి ఏకదంతేశ్వరరావు
న్యాయవాది, లావుడివీధి, సాలూరు.
సెల్ : 9440913367

సాలూరు
తే 07-04-2023